
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
గురువారం 23 జనవరి 2025



బదిలీల్లో దళారులు..

- పరస్పర బదిలీలకు బేరసారాలు
- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- అండర్ టేకింగ్ ప్రక్రియ షురూ

జగిత్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ప్రభుత్వం పరస్పర (మ్యూచువల్) బదిలీలకు అవకాశం ఇవ్వడంతో కొందరు దీన్ని సొమ్ము చేసుకుంటు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నూతన ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టగా పాఠశాలల్లో కాస్త సిబ్బంది కొరత తీరింది. గతంలో 317 జీవో ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లిన వారు పరస్పర బదిలీలతో సొంత ప్రాంతాలకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు ఉపాధ్యాయులు బేరాలకు దిగుతున్నారు. కొందరు సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు అక్కడున్న వారికి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు నజరానా ఇచ్చి ఒప్పించుకున్నట్లు సమాచారం. ఇందుకోసం కొందరు మధ్యవర్తులు ఇరువురి మధ్య బేరసారాలు చేసి ఒప్పించినట్లు ప్రచారం జరుగుతోంది.

● స్పౌస్ బదిలీలకు 37 మంది దరఖాస్తు

ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో జీవో నంబర్ 317 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టింది. ఈ జీవో ప్రకారం కొంత మంది ఉపాధ్యాయులు జగిత్యాల జిల్లా నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మిగిలిన ప్రాంతాలకు వెళ్లారు. ఆయా జిల్లాల నుంచి పలువురు ఉపాధ్యాయులు జగిత్యాల జిల్లాకు వచ్చారు. అనంతరం ఒకే శాఖ పరిధిలోని ఉద్యోగులు పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకునేలా 2023లో ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో కొంత మంది సద్వినియోగం చేసుకున్నారు. ఈనెల 16వ తేదీన ప్రభుత్వం మరోసారి పరస్పర బదిలీలకు అనుమతి ఇవ్వడంతో ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. జిల్లాలోని 37మంది ఉపాధ్యాయులకు స్పౌస్ బదిలీ కోసం అనుమతి లభించింది. ఇందులో జగిత్యాల జిల్లా నుంచి ఇతర జిల్లాలకు 35మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడానికి సిద్ధమవగా, ఇతర జిల్లాల నుంచి జగిత్యాలకు రావడానికి ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా నుంచి 63మంది ఉపాధ్యాయులు పరస్పర బదిలీ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించడం, అండర్ టేకింగ్ పత్రాల ను తీసుకునే ప్రక్రియ చేపట్టారు.

● సీనియారిటీ కోల్పోవడంపై ఆందోళన

పరస్పర బదిలీల్లో భాగంగా ఒక లోకల్ కేడర్ నుంచి మరో లోకల్ కేడర్‌కు వెళ్తే సీనియారిటీ మొత్తం కోల్పోతారని గతంలో జారీ చేసిన జీవోలో ప్రభుత్వం పేర్కొంది. కొందరు ఉపాధ్యాయులు ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చే తుది తీర్పునకు కట్టుబడి ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో పరస్పర బదిలీలకు తాత్కాలికంగా న్యాయ చిక్కులు తొలగినట్లయింది. అలాగే కోర్టు తుది తీర్పునకు కట్టుబడి ఉంటామని సమ్మతిపత్రం ఇచ్చిన ఉపాధ్యాయుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటున్నారు. అయితే ఆయా టీచర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో పనిచేస్తూ ..

మిగతా 6లో

గ్రామసభల్లో నిలదీతలు.. నిరసనలు

● జాబితాలో అర్హుల పేర్లు లేవని ఆందోళన 6



కొడిమ్యాల గ్రామసభలో పడుకొని నిరసన తెలుపుతున్న దరఖాస్తుదారుడు

రా రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

● రాష్ట్ర రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గణపతి రెడ్డి 6

వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

6

● అదనపు కలెక్టర్ లత

కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు శ్రీకారం

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



జగిత్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జాబితాలో పేరు లేనివారు కూడా గ్రామ సభల్లో నమోదు చేసుకోవచ్చునని ఆమె సూచించారు. కొత్త రేషన్‌కార్డుల జారీపై ఆమె ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రజలకు ఉన్న పలు అనుమానాలను నివృత్తి చేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : లబ్ధిదారుల జాబితాలో పేరు లేని వారి సంగతేంటి?

అదనపు కలెక్టర్ : జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అర్హులైన వారు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి : గతంలో ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు?

అదనపు కలెక్టర్ : ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులను అర్హత ప్రమాణాల ప్రకారం పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులను అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి : కొత్త దరఖాస్తులను ఎప్పటివరకు ఇవ్వొచ్చు?

అదనపు కలెక్టర్ : కొత్త రేషన్ కార్డుల కోసం గ్రామ సభల్లో ఈనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించవచ్చు. అటువంటి దరఖాస్తులను కూడా పరిశీలిస్తాం.

ఆంధ్రజ్యోతి : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిస్థితి ఏంటి?

అదనపు కలెక్టర్ : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియ కేవలం కుల సర్వే జాబితాకు పరిమితం కాదు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 12 లక్షల 758 దరఖాస్తులను కూడా అర్హత ప్రమాణాల ఆధారంగా పరిశీలిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : కులాల సర్వే జాబితా ధ్రువీకరణ పూర్తయిందా ?

అదనపు కలెక్టర్ : కులాల సర్వే కుల గణన ఆధారంగా రూపొందించిన జాబితాను పరిశీలనకు పంపారు. నిర్ణీత ధ్రువీకరణ తర్వాత అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తాం.

అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తాం

● కలెక్టర్ సత్యప్రసాద్



నర్సింగాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి నిరుపేదకు అందజేస్తామని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లువంటి పథకాలకు అర్హులైన వారి జాబితాను గుర్తించి గ్రామసభలో ప్రవేశపెట్టామన్నారు. లిస్టులో పేర్లురానివారి ఆందోళన చెందవద్దని గ్రామసభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 26 నుంచి ప్రభుత్వం పథకాలను లాంఛనంగా ప్రభుత్వం ప్రారంభిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో దరఖాస్తుల వెల్లువ

● రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు కావాలంటూ అర్జీలు

జగిత్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కొరకు గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో చేపట్టిన సభలకు ఆశావహులు పోటెత్తుతున్నారు. బుధవారం రెండవ రోజు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 179 సభలు నిర్వహించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లో 46 వార్డు సభలు, పలు గ్రామాల్లో 103 వార్డు సభలను నిర్వహించారు. ధర్మపురి మండలం జైనా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతరులు హాజరయ్యారు.

అత్యధికంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కొరకు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో రేషన్‌కార్డుల కోసం బుధవారం 8,475 దరఖాస్తులు, ఇందిర మ్మ ఇళ్ల కోసం 5,443 దరఖాస్తులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 2,499 దరఖాస్తులు, రైతు భరోసాకు 236 దరఖాస్తులు వచ్చాయి.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



స్వామి వివేకానంద విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే

జగిత్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని శ్రీ వివేకానంద మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతితో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా మంది యువకులు ఆన్‌లైన్ బాట పట్టారన్నారు. ఆన్‌లైన్‌లో దేశ సంస్కృతి సాంప్రదాయాలు, స్ఫూర్తిదాయకమైన మహాత్ములరచనలు, పుస్తకాలు చదవడంవల్ల అనేక విషయాలు అవగత మవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, అడువాల లక్ష్మణ్, వివేకానంద విగ్రహ కమిటీ కార్యదర్శి మ్యాన మహేష్, కౌన్సిలర్లు రామ కృష్ణ విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు భోనగిరి దేవయ్య, నర్సింగా రావు పాల్గొన్నారు.

లే అవుట్ లేని నిర్మాణాలు వద్దు

పట్టణంలోని 10, 25, 26, 27, 39 వార్డులలో రూ.80లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. అనంతరం బీట్ బజార్‌లో గల మార్కెట్‌లో రూ.35 లక్షలతో మరుగుదొడ్ల మిగులు పనులను ప్రారంభించారు.కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు భారతి, ఆరుముల్ల నర్సమ్మ, రజీయు ద్దీన్, అస్మా అంజుమ్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, తాజొద్దీన్, శరత్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, జనవరి22(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని పూడూర్ గ్రామంలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో 38లక్షల రూపాయలతో నిర్మించిన గోదాంను బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం మండలంలోని నాచుపల్లి గ్రామంలో కొడిమ్యాల సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం చుట్టు నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు గోదాంలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, పూడూర్, కొడిమ్యాల సింగిల్ విండోల చైర్మనులు రవీందర్‌రెడ్డి, రాజనర్సింగరావు, సింగిల్ విండోల ఉపాధ్యక్షులు రమేష్, కవితచంద్రమోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, సీఈవోలు రాజేందర్ రెడ్డి, గంగాదర్, సింగిల్ విండోల డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యం శంకర్, స్వామి, ప్రభాకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధుల మంజూరు చేయాలి

కొడిమ్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండ్‌కు నిధులు మంజూరు చేయాలని కొడిమ్యాల మేజర్ గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచు ఏలేటి మమతనర్సింహరెడ్డి బుధవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. బస్టాండ్‌లో మూత్రశాలలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కొడిమ్యాల ఖబ్రస్థాన్‌లో హైమాస్ట్ విద్యుత్‌లైట్ల ఏర్పాటుకు, ఈద్గాచుట్టు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రేకులపల్లి రవీందర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బండ నర్సింహరెడ్డి, సల్మాన్, సంఘం సభ్యులు మోసీన్ తదితరులు ఉన్నారు.

ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలి

జగిత్యాలఅగ్రికల్చర్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేం ద్రంలో జగిత్యాల సర్కిల్ పక్కాన టీవీఏసీజేఏ సీ ఆధ్వర్యంలో ఆర్టిజన్‌లు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మూడోరోజు రిలే దీక్షలో భాగంగా దీక్షలో పాల్గొన్న వారు మాట్లాడుతూ తమ వ్యక్తిగత జీవితాలను పక్కన పెట్టి సంస్థ కోసం పనిచేశామని, దశాబ్దకాలంగా ఐదుగురు చేసే పనిని కేవలం ఇద్దరం మాత్రమే చేశామన్నారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి దమ్మ రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అన్నారపు రమేష్, ప్రధాన కార్యదర్శి ఆరుముల్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు తిరుపతి, అంబాజీ నాయక్, పూసల ప్రభుదాస్ తదితరులున్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

జగిత్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అధ్యాపకులు కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైద్రాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం నూతన సంవత్సర డైరీలను పలువురు జగిత్యాల జిల్లా ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో వస్తున్న నూతన పోకడలకు అనుకూలంగా అధ్యాపకులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, క్రమంగా అన్ని సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామన్నారు. ఈ కర్యాక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేదర్‌రెడ్డి, జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసాల వర ప్రసాద్, నాయకులు చిన్న, పావని, తిరుపతయ్య, మహేశ్, రాజారాం, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

గొల్లపెల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) మండలంలోని లొత్తునూర్‌లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 80 పశువులకు వైద్యం చేశారు. రైతులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు తిరుపతి గౌడ్, డాక్టర్ అచ్చె శ్రీనివాస్, డాక్టర్ రవీందర్, వెటర్నరి అసిస్టెంట్‌లు ప్రవీణ్, సంధ్య, గోపాల మిత్రలు శ్రీకాంత్, రవీందర్, నరహరి పాల్గొన్నారు.

సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

● రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హెలికాప్టర్ వద్ద మంత్రి ఉతమ్, పొన్నం ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్నమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ధర్మపురి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి సమస్య కోసం శాశ్వత పరిష్కారం చేస్తానని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సభలో మాట్లాడుతూ గోదావరి నది ఎండిపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారని అన్నారు. రిజర్వాయర్‌లో నీరు తక్కు వగా ఉన్నాయని, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఆర్ఎస్‌పీ నుండి నీరు విడుదల చేయించినట్లు ఆయన తెలిపారు. గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో కొంత సమస్య ఉందని సాంకేతిక నిపుణులతో చర్చించి తప్పకుండా శాశ్వత పరిష్కారం చేస్తానని ఆయన అన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు '

రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని అన్నారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో గందర గోళం సృష్టిస్తే తగిన బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, మాటల ప్రభుత్వం కాదని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నాలుగు ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఆయన అన్నారు.

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాటాడుతూ గోదావరి నది తీర ప్రాంతానికి రైతాంగానికి కష్ట కాలంలో నీరు విడుదల చేయించిన జల ప్రదాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటూ కొనియాడారు. ఇప్ప టికి అర టీఎంసీ నీరు విడుదల చేయించినట్లు ఆయ న తెలిపారు. మరో అర టీఎంసీ నీరు విడుదల చేయిస్తారని ఆయన అన్నారు. అంతకు ముందు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లకు ధర్మపురి హెలిపాడ్ వద్ద నుండి కాంగ్రెస్ కార్యకర్తలు స్వాగతం పలికి జైనా గ్రామం వరకు భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, మేడిపల్లి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపెల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, తహసీల్దార్ కృష్ణచైతన్య, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కంట సుధాకర్ పాల్గొన్నారు.

● ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిరకాల స్వప్నం నెరవేరిందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 2018 ఎన్నికల్లో తాను పీసీసీ అధ్యక్షులుగా ఉన్న కాలంలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వవద్దని అనేక మంది చెప్పినా తాను టికెట్ ఇచ్చానని కానీ ఆయన కొద్ది ఓట్ల తేడాతో ఓడినట్లు ఆయన పేర్కొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం

మంత్రులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టరావుపల్లె గ్రామానికి చెందిన గూడ సురేష్, మమతలు బుధవారం ద్విచక్రవాహనంపై ఇల్లంతకుంట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా, వెల్జీపూర్ గ్రామానికి చెందిన అట్ల నాగభూషణం ద్విచక్ర వాహనంపై ఇల్లంతకుంటకు వస్తున్నారు. రెండు వాహనాలు ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో నాగభూషణం, మమతలు గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిధిలోని సుందిల్ల గ్రామం గడ్డంపల్లికి చెందిన రామగుండం సాయికిరణ్(20) అనే యువకుడి అదృశ్యంపై గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సాయికిరణ్ గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తక్కువ వేతనం వస్తుందని, వేరే పని చూసుకుంటానని తండ్రి వెంకటేశంకు చెప్పిన సాయికిరణ్ వారం రోజులుగా ఆసుపత్రి విధులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఏదైనా పని చూసుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయికిరణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో సాయికిరణ్ తండ్రి వెంకటేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


ఎల్లయ్య (ఫైల్)

మానకొండూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఊరడి ఎల్లయ్య (45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 17న మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఎల్లయ్యతో పాటు రవికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎల్లయ్య మృతి మృతి చెందాడు. ఊరడి ఎల్లయ్య మృతి చెందడంతో బుధవారం గ్రామస్థులు కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి రాఘవాపూర్ వద్ద నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు భైఠాయించి ధర్నా చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన శాంతింపచేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


జలపతిరెడ్డి (ఫైల్)

గన్నేరువరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన గన్నేరువరం మండల కేంద్రం శివారులో బుధవారం రాత్రి జరిగింది. గన్నేరువరం గ్రామ పరిధిలోని మారెల్లకుంటకు చెందిన ఏలేటి జలపతి రెడ్డి(65) బుధవారం రాత్రి మండల కేంద్రం శివారులోని ఖాసింపేట కట్టె మిషన్ చౌరస్తా వద్ద నుండి తన ఇంటికి కాలినడకన నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో జలపతి రెడ్డికి తలకు ముఖానికి తీవ్రగాయాలై ముక్కు నుండి తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై పడి ఉన్నాడు. అటుగా వెళుతున్న కొందరు అంబులెన్స్‌కు సమాచారం అందించి కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు బిడ్డలు, ఇద్దరు కుమారులు కాగా వీరందరూ బొంబాయిలో నివాసం ఉంటున్నారు. మృతుడు ఒక్కడే తనకు ఉన్న ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కట్టెకోత మిషన్ వద్ద ఓ రేకులషెడ్డులో నివాసం ఉంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తిమ్మాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మినీగూడ్స్ వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఎల్‌ఎండీ ఎస్‌ఐ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..మహాత్మానగర్ గ్రామంలో సమద్ అనే వ్యక్తికి చెందిన హోటల్‌లో రమ్య(60) అనే మతిస్థిమితం లేని మహిళ గత 15 సంవత్సరాలుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. బుధవారం మధ్యాహ్నం సమయంలో హోటల్‌లో పార్శిల్ తీసుకొని తినేందుకు రోడ్డు దాటుతున్న ఆమెను హైదరాబాద్ నుంచి కరీంరనగర్ వైపు వెళ్తున్న మినీ గూడ్స్ వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు విచారించగా ఆమె వివరాలేవీ తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివేక్ తెలిపారు.

కారు, అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ

మల్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో కారు, అంబులెన్స్‌ను ఓ లారీ ఢీకొట్టింది. జగిత్యాల వైపు నుంచి వస్తున్న లారీ కారును ఓవర్‌టేక్ చేస్తూ కారుతో పాటు ఎదురుగా వస్తున్న ప్రైవేట్ అంబులెన్స్‌ను ఢీకొంది. కారు, అంబులెన్స్ వాహనాలు కొంతమేర దెబ్బతినగా, రహదారిపై వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

కుటుంబాలకు తాతయ్యలు మార్గదర్శకులు


తాతయ్యలను సన్మానిస్తున్న మనుమలు

జగిత్యాల అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాతయ్యలు కుటుంబాలకు, సమాజానికి మార్గదర్శకులని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం తాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు తాతయ్యలను మనుమలు సన్మానించారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ మనుమలు, మనుమరాళ్లకు, వారి లక్ష్య సాధనలో తల్లిదండ్రులకు సలహాలు ఇవ్వడంలో తాతలు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా కార్యదర్శి వెల్ముల ప్రకాష్ రావు, బీసీ హన్మంత రెడ్డి, ఎండీ యాకూబ్, పూసల అశోక్ రావు, సత్యనారాయణ, దిండిగాల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో ఐపీఎస్ అధికారి


పోలీస్ అధికారిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

మల్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రశ్మి పెరుమళ్ బుధవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానా చార్యులు కపీందర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, పర్యవేక్షకులు హరిహరనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్సై నరేశ్ కుమార్ తదితరులు ఉన్నారు

ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయికి ఎన్నిక

కాల్వశ్రీరాంపూర్, జనవరి 22,(ఆంధ్రజ్యోతి): ఆంగ్లఫోరం ఆధ్వర్యంలో 21న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇంగ్లీష్ ఒలంపియాడ్ పోటీలలో మండలంలోని మల్యాల మోడల్ స్కూల్ బాలికలు అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.అక్షయ, వి.సాయిశివాని, విద్యార్థినిలు ఎంపిక కాగా ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఉన్నారు.

ఆందోళన బాటలో ఆర్టిజన్స్



పెద్దపల్లిలో దీక్ష చేస్తున్న ఆర్టిజన్లు

- వెట్టిచాకిరీ ఉద్యోగాలు మాకొద్దంటూ నిరసన
- రెగ్యులర్ చేయాలని డిమాండ్

పెద్దపల్లిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరి ఉద్యోగాలు మాకొద్దని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవలేని పరిస్థితి నెలకొందని, సమానపనికి సమానవేతనం రావడం లేదని ఆర్టిజన్ ఉద్యోగులు నిరసన బాటపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని రిలే దీక్షలకు దిగారు. జిల్లాలో 75 సబ్‌స్టేషన్లలో 300 మందిపైగా ఆర్టిజన్లు ఎస్పీడీసీ ఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల్లో సబ్‌స్టేషన్ ఆపరేటర్లుగా, వాచ్‌మెన్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. విద్యార్హతను బట్టి ఐటీఐ చేస్తే జేఎల్ఎమ్‌గా, డిప్లొమా అయితే సబ్‌ఇంజనీర్‌గా, పదోతరగతి విద్యార్హతతో వాచ్‌మెన్లుగా, డిగ్రీ చదివిన వారు కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యూలర్ చేస్తామని హామీ ఇచ్చి ఆర్టిజెన్లుగా గుర్తించి స్టాండింగ్ ఆర్డర్స్ విడుదల చేసింది. దీంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన బెనిఫిట్స్ అందడం లేదు. సమానపనికి సమాన వేతనంలేక వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ఉద్యోగి చనిపోతే వారసులకు విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉండగా గ్రేడ్-4 ఉద్యోగాలు (వాచ్‌మెన్లు, స్వీపర్లు) ఇస్తున్నారు. కనీసం సెలవులు కూడా ఇవ్వడంలేదు, రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్‌కు కూడా నోచుకోవడం లేదు.

● ఒకే సంస్థలో రెండు సర్వీస్ రూల్స్..

ఒక్కో సబ్‌స్టేషన్లో నలుగురు సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, ముగ్గురు వాచ్‌మెన్‌లు పని చేయాల్సి ఉంటుంది. ఇద్దరు లేదా ముగ్గురు ఆపరేటర్లు, ఒక్క వాచ్‌మెన్‌తో సబ్‌స్టేషన్లు నడిపిస్తున్నారు. దీంతో సెలవులు ఇవ్వకపోవడంతో ఉన్న ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనారోగ్యం బారినపడి రాకపోతే ఉన్న ఉద్యోగులు సర్దుకుపోవాల్సిందే. కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినా కొత్తగా ఉద్యోగులను భర్తీ చేయడం లేదు. ఒకే సంస్థలో సర్వీస్ రూల్స్ రెండు ఉన్నాయి. ఏపీఎస్ఈబీ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్), స్టాండింగ్ ఆర్డర్స్ వేరువేరుగా ఉన్నాయి. స్టాండింగ్ ఆర్డర్స్ బ్రిటీష్ పాలనలో ఉన్న నిబంధనలు ఉండడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. సమస్యలు తాళలేక ఉద్యోగులు స్టాండింగ్ ఆర్డర్స్ నుంచి ఏపీఎస్ఈబీలోకి కన్వర్షన్ చేసి బెన్‌ఫిట్స్ తమకు అందించాలని నిరసనలు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇటీవల రిలే దీక్షలు చేపట్టారు. ఫిబ్రవరి 20న విద్యుత్ సౌధను ముట్టడించేందుకు జేఏసీ నిర్ణయం తీసుకుంది. వీరు చేపట్టిన దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు పలుకుతున్నాయి. విద్యుతు శాఖలో ఉన్న సంఘాలు తమకు మద్దతు పలకాలని కోరుతున్నారు.

ఏపీఎస్ఈబీలోకి కన్వర్షన్ చేయాలి

- దుర్గం విశ్వనాథ్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. మమ్మల్ని కన్వర్షన్ చేసి ఏపీఎస్ఈబీలో చేర్చాలి. మాకు రావాల్సిన బెన్‌ఫిట్స్ అందించాలి.

సరిపడా ఉద్యోగులను భర్తీ చేయాలి

- దండే దేవేందర్



జిల్లాలో ఉన్న సబ్ స్టేషన్ల వారీగా సరిపడా ఉద్యోగులను భర్తీ చేసి వెట్టిచాకిరీ నుంచి మాకు విముక్తి కల్పించాలి. అవసరాలను బట్టి సెలవులు మంజూరు చేయాలి.

ఎన్నోసార్లు నిరసన చేపట్టాం

- కొంకటి రవీందర్



మా సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులకు, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేశాం. ఎలాంటి స్పందన లేకపోవడం తో నిరసనలకు దిగాం. ఫిబ్రవరిలో విద్యుత్ సౌధను ముట్టడించేందుకు జేఏసీ నిర్ణయం తీసకుంది.

ఆలయ భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు


ఆలయ స్థలాన్ని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ

కరీంనగర్ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయశాఖ పరిధిలోని భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలుంటాయని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ పేర్కొన్నారు. బుధవారం రాంపూర్‌లోని గిద్దెపెరుమాళ్ల ఆలయాన్ని ఆమె కార్యాలయ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. దేవాలయానికి చెందిన సర్వే నెంబరు 873 లోని 9 ఎకరాలు, సర్వే నెంబరు 410 లోని 9 ఎకరాల 39 గుంటలు కలిపి మొత్తం 18 ఎకరాల 39 గుంటల భూమిని ఆమె పరిశీలించారు. గతంలో సహాయ కమిషనర్ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించిన భూమి సర్వే నెంబరు 873 లోని 10 గుంటల స్థలంలో ఓ రేకుల షెడ్ (అక్రమ నిర్మాణం) గుర్తించామని తెలిపారు. ఈ షెడ్‌ను వారం లేదా 10 రోజుల్లో తొలగించుటకు, ఆక్రమణ దారులపై చట్టపర చర్యలు తీసుకుంటామని అన్నారు. సర్వే నెంబరు 873లో దేవాలయ భూమి నుంచి ఓ డ్రైనేజీ కాలువను గుర్తించామని, ఈ విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో కమిషనర్‌కు డ్రైనేజీ కాలువ మళ్లింపుకు గాను చర్యలు తీసుకోవాలని, డ్రైన్ నిర్మాణం చేపట్టి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న నివాస గృహాల వారికి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రెండు, మూడు రోజుల్లో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. కమిషనర్ వెంట కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌లు కొత్తకొండ శ్రీనివాస్, తేజ, మహేందర్, టి రాజమౌళి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి

జగిత్యాలరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని 437, 251 సర్వేనంబర్లలో గల ప్రభుత్వ భూములను కొంతమంది స్థానికేతరులు అక్రమ పట్టాలు పొంది అనుభవిస్తున్నారని, అక్రమ పట్టాలను రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరాఫరాలు, ఇరిగేషన్ శాఖమాత్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు.

నర్సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని గ్రామానికి ఎలాంటి సంబంధంలేని వ్యక్తులు, భూమిపై ఎలాంటి హక్కులు లేకపోయినప్పటికీ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ధరణిద్వారా పేర్లు మార్చుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొందడమేకాకుండా రైతుబంధు సైతం పొందుతు న్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఈ సర్వేనంబర్లలోని పట్టాలు పొందిన వివరాలు అందజేయాలని కోరడంతో పాటుగా, అక్రమంగా పట్టాలు పొందినవారి పాసుపుస్తకాలను రద్దు చేయాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చర్యలు తీసుకోకుంటే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని లేఖలో పేర్కొన్నారు.

మోరపల్లి కార్యదర్శి సస్పెన్షన్

- కారోబార్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

జగిత్యాలరూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం మోరపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్‌కు జగిత్యాల రూరల్ మండల ప్రత్యేకాధికారి నరేష్ నివేదిక అందజేశారు. ఈ మేరకు కారోబార్‌ను విధుల నుంచి తొలగిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

- యువతిని సఖి కేంద్రానికి తరలించిన పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రక్షణ కల్పించాలంటూ ఓ ప్రేమజంట బుధవారం ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించింది. ఇద్దరూ మేజర్లు కావడం వల్ల ఇరు కుటుంబాలకు పోలీసులు సమాచారం అందించి అవగాహన కల్పించారు. యువతి ఓసారి పెళ్లి ఇష్టమంటూనే మరోసారి తల్లిదండ్రుల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేయడంతో పోలీసులు ఆమెను సఖి కేంద్రానికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్ తండాలోని యువకుడు భానుప్రసాద్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. కామారెడ్డి జిల్లా భవానిపేట తండాలకు చెందిన యువతి పుష్ప హైదరాబాద్‌లో చదువుతోంది. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం కావడం, వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వివాహానికి వారి తల్లిదండ్రులు అంగీకరించకపోవడం వల్ల ఆలయంలో పెళ్లి చేసుకుని ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రమాకాంత్ ఇరు కుటుంబ సభ్యులతో పాటు ప్రేమ జంటకు అవగాహన కల్పించారు. యువతి పుష్ప తనకు పెళ్లి ఇష్టమని చెప్పడంతో పాటు తన తల్లిదండ్రుల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పడంతో యువతికి రక్షణ కల్పించేందుకు సఖి కేంద్రానికి తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణ కోరగా యువతి పుష్ప, యువకుడు భానుప్రసాద్‌లు ప్రేమపెళ్లి చేసుకుని తమను ఆశ్రయించారని పేర్కొన్నారు. పెళ్లి విషయంలో సరైన నిర్ణయం తీసుకోవడంలో యువతి స్పష్టమైన సమాధానం చెప్పకపోవడం వల్ల ఆమెకు రక్షణ కల్పించేందుకు సఖి కేంద్రానికి తరలించామని వివరించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి 13నెలల జైలు

సిరిసిల్ల క్రైం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని దారి చూపెట్టమని అడిగి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన కేసులో సిరిసిల్ల పట్టణం కేసీఆర్‌నగర్‌కు చెందిన మ్యాన శివ, కూరపాటి నరేష్‌లకు 13నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఏ. ప్రవీణ్ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బొప్ప మల్లవ్వ తన ఇంటి ముందు కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మ్యాన శివ, కూరపాటి నరేష్‌లు రామలక్ష్మణపల్లెకు వెళ్లే దారి అడుగుతూ ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారణ అనంతరం అప్పటి ఎస్‌ఐ శేఖర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ ఏడుగురు సాక్షులను ప్రవేశ పెట్టారు. పీపీ చెలుముల సందీప్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు 13నెలల జైలు శిక్ష, 200 జరిమానా విధించారు.

కవులకు పురస్కారాలు ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకర వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో జరిగిన గిడుగు జాతీయ పురస్కారాలు, కవి సమ్మేళనంలో కరీంనగర్ చెందిన గంప ఉమాపతి (ఎందుకిలా? పుస్తకం), నగునూరి రాజన్న (కలల లోగిలి పుస్తకం) పురస్కారాలు అందుకున్నారు. రచయితలకు పలువురు అభినందనలు తెలిపారు.

హుజూరాబాద్‌కు బీసీల సైకిల్‌యాత్ర

హుజూరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యత హక్కుల సాధన కోసం తలపెట్టిన బీసీల సైకిల్‌యాత్ర బుధవారం రాత్రి హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ మాట్లాడుతూ జనాభాలో దాదాపు సగభాగమైన బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు.

టీఎస్‌పీఈ(1535) రీజినల్ కమిటీ ఎన్నిక


ఠాకూర్ చందర్‌సింగ్, ఎండీ జియా, సురేంద్రప్రసాద్

గణేశ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ప్రెసిడెంట్ ఎంఏ వజీర్, టీఎస్ ట్రాన్స్‌కో ప్రెసిడెంట్ కే. శ్రీనివాస్ రెడ్డి, జమీరుద్దీన్ సిద్ధిఖీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 సర్వసభ్య సమావేశంలో రీజినల్ కమిటీని ఎన్నుకున్నారు. కరీంనగర్ రీజియన్ గౌరవ అధ్యక్షుడిగా జీ సురేంద్రప్రసాద్, రీజినల్ అధ్యక్షుడిగా ఠాకూర్‌చందర్‌సింగ్, రీజినల్ సెక్రటరీగా ఎండీ జియాని నియమించారు. నూతనంగా ఎన్నికైన వారిని జమీరుద్దీన్, ఇతర ఉద్యోగులు, సంఘం నాయకులు శుభా కాంక్షలు తెలిపారు. తమ ఎన్నికకు సహక రిం చిన ప్రతి ఒక్కరికీ నూతనంగా ఎన్నికైన వారు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

ప్రయాణికుల భద్రత కోసం 'అభయ' యాప్

- 800 ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం
- ఎస్పీ అఖిల్ మహాజన్



అభయ యాప్ పై టాక్సీ సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రయాణం కోసమే అభయ యాప్‌ను అనుసంధానం చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫెస్-2అభయ యాప్ పై ఆటో టాక్సీ సేఫ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్-2లో భాగంగా 800 ఆటోలకు క్యూ ఆర్ కోడ్‌తో అనుసంధానం చేశామన్నారు. ప్రయాణికులకు సురక్షితంగా ప్రయాణిస్తున్నామనే నమ్మకం కలిగించాలన్నారు. ఆటో డ్రైవర్‌లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పరిమితిలోపు ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. జిల్లాలో మొదటి విడతగా 4వేల వాహనాలకు అనుసంధానం చేశామన్నారు. అభయ యాప్‌తో వాహనాల డ్రైవర్‌లకు రూ.50 చెల్లింపుతో యాక్సిడెంటల్ డెత్‌కు రూ.లక్ష బీమా సౌకర్యం కల్పించామన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణంతోపాటు వివిధ ప్రాంతాలకు వేలాది మంది ప్రయాణికులు వస్తారని, వారి రక్షణ దృష్ట్యా పైఆటో టాక్సీ సేఫ్‌ను తీసుకొచ్చామన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ప్రయాణికులు ఏదైనా సంఘటనలను ఎదుర్కొన్నప్పుడు ఆటోకు ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేయాలన్నారు. ఈ స్కాన్ ద్వారా వెంటనే డ్రైవర్ ఫొటో, వివరాలతో పాటుగా వాహనానికి సంబంధించిన వివరాలు వస్తాయన్నారు. ఆటో ఎక్కినప్పటి నుంచి దిగే వరకు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా మానిటర్ చేస్తారన్నారు. సమీపంలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని రక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. ఆటోలో ఎక్కిన మహి ళలు ప్రాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్‌లు ఏదైనా నేరాలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్య క్రమాలకు పాల్పడినా సీసీ కెమెరాల ద్వారా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్నపుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా యాప్ ద్వారా ఫిర్యాదు చేయ వచ్చన్నారు. ఆటో డ్రైవర్‌లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్‌లకు క్యూఆర్ కోడ్ పత్రాలు, ప్రమాద బీమా పత్రాలు అందజే శారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్‌ఐ రాజు, రమేశ్, అభయ యాప్ సృష్టికర్త అభిచరణ్ ఉన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

రుద్రంగి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలో నిండు గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. రుద్రంగికి చెందిన సూర శృతి నెలలు నిండడంతో మంగళవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో 108లో వేములవాడ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో ఆ మెకు నొప్పులు ఎక్కువ య్యాయి. దీంతో 108 వాహనంలోనే ఈఎమ్‌టీ గణేష్, అంబులెన్స్ పైలట్ మహేష్‌లు పురుడు పోశారు.గర్భిణి సూర శృతి మగ శిశువుకు జన్మని చ్చింది. అనంత రం ఆసుపత్రికి తరలిం చారు.తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో వివేకానంద విద్యార్థి ప్రతిభ

గంగాధర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో వివేకానంద పాఠశాల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో 46వ సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టులో గంగాధర మండలానికి చెందిన సాయిచరణ్ పాల్గొన్నారు. జిల్లా జట్టు వరంగల్ జట్టుపై గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించింది.

రాష్ట్రస్థాయికి ఎంపిక

గన్నేరువరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పత్తి వైశాలి ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లీష్ ఎలక్యూషన్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. విద్యార్థిని, గైడ్‌టీచర్ సుప్రియలను పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో రామయ్య అభినందించారు.

త్యాగరాజ స్వామి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయి..



మృదంగం వాయిస్తున్న ఎల్లా వెంకటేశ్వర్‌రావు

● ఆకట్టుకున్న పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వర్‌రావు మృదంగ విన్యాసం

మృదంగ లయ విన్యాసకులు పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వర్ రావు చేసిన మృదంగ లయ విన్యాసం భక్తులను ఆకట్టు కుంది. త్యాగరాజ ఆరాధనోత్సవాలకు విచ్చేసిన ఆయనకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పూలమాల వేసి స్వాగతం పలి కారు. అంతేకాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో హాజరైన కళాకారులు ఇచ్చిన కళా ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

● ఆరాధనోత్సవాల ముగింపులో ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీత్యాగరాజ స్వామి రచించిన కీర్తనలు చరిత్రలో నిలిచిపోతా యని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ముగి శాయి. ముందుగా ఉదయం శ్రీత్యాగరాజ స్వామి చిత్రపటా నికి పూలమాలలు వేసి అర్చకులు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు కార్యక్రమానికి ఈవో వినోద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాజన్న ఆలయంలో గత 72 సంవత్సరాలుగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. త్యాగరాజ స్వామి శ్రీరాముని భక్తితో రచించిన కీర్తనలు ఎంతో ప్రసిద్ధి చెందాయని, నేటి యువ కళాకారులు త్యాగరాజ స్వామి స్ఫూర్తితో తమ కళల్లో రాణించాలని సూచించారు. కాగా సాంస్కృతిక కార్యక్రమాల్లో కళ ప్రదర్శన చేసిన కళాకారులకు రాజన్న చిత్రపటాలను అందజేసి ఘనంగా సన్మానించారు.



హరికథ గానం చేస్తున్న కళాకారిణి



కళాకారులకు రాజన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న భక్తులు

గణతంత్ర వేడుకలకు 'ఖని' అంగన్‌వాడీ టీచర్



స్వర్ణలత

కళ్యాణ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు గోదావరిఖని నుంచి అంగన్‌వాడీ టీచర్ ఎన్ స్వర్ణలత ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగే ఈ వేడుకలకు తెలంగాణ నుంచి ఐదుగురు ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లను ఎంపిక చేయగా అందులో రామగుండం అర్బన్ ప్రాజెక్ట్ నుంచి స్వర్ణలత ఎంపికయ్యారు. స్వర్ణలత ఎంపికపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తం చేశారు.

నేషనల్ అడ్లోసెంట్ హెల్త్ అకాడమీ చైర్మన్‌గా హిమబిందు

కళ్యాణ్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అడ్లోసెంట్ హెల్త్ అకాడమీ చైర్మన్‌గా సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (సిమ్స్) ప్రిన్సిపాల్ హిమబిందును ఎన్నుకున్నారు. ఈ నెల 8 నుంచి 12వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన 62వ నేషనల్ కాన్ఫరెన్స్ ది ఇండియన్ అకాడమిక్ ఆఫ్ పీడియాట్రిక్ సెమినార్‌లో హిమబిందును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. దేశవ్యాప్తంగా 48వేల మంది ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆరు అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ప్రతీ నెల యువ కేంద్రం ద్వారా డిజిటల్ వెల్‌నెస్, రోడ్ సేఫ్టీ వెల్‌నెస్, హిమ్రనాలెడ్జ్, సెక్సువల్ వెల్‌నెస్ వంటి సబ్జెక్టులపై యువతకు అవగాహన కల్పించనున్నారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చిన్నపిల్లలకు బూస్టర్ డోస్‌ల వంటి వాటిపై అవగాహన కల్పించనున్నారు. చైర్మన్‌గా ఎన్నికైన హిమబిందును హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది అభినందించారు.

రేపు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం



భగత్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయా ణికులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకం. రాత్రి, పగలు, ఎండావానా, చలి వంటి పరిస్థితులను తట్టుకొని బాధ్యతలను నిర్వరి స్తున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి భోజనం, విశ్రాంతికి దూరమైనా గంటల తరబడి డ్రైవింగ్ చేస్తున్నారు. విధి నిర్వహణలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. జీవనోపాధికి డ్రైవర్ ఉద్యోగాన్ని ఎంచుకున్నా దినదిన గండంగా రోజులు వెళ్లదీస్తు న్నారు. జనవరి 24న ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, మంథని, గోదావరిఖని, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోల్లో 1,060 మంది డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరు ప్రతిరోజు 4.5 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లపై ఒత్తిడి మరింత పెరిగింది.

● నియామకాలు లేకపోవడంతో ఉన్నవారిపై పనిభారం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 11 సంవ త్సరాలుగా డ్రైవర్ల నియామకాలు చేపట్టలేదు. వేల మంది డ్రైవర్లు ఉద్యోగ విరమణ, మెడికల్ అన్‌ఫిట్ పొందుతున్నారు. నియామకాలు లేకపోవడంతో ఉన్న డ్రైవర్లతోనే డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు. దీంతో డ్రైవర్లకు సరైన విశ్రాంతి ఉండడం లేదు. రిటైర్ అ యిన డ్రైవర్లకు పెన్షన్ తక్కువ మొత్తంలో వస్తుంది. దీంతో చాలా మంది డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు.

● ప్రభుత్వాలు ఆదుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్లను ఆదుకునే వి ధంగా పథకాలు రూపొందించాలని ఆర్టీసీ డ్రైవర్లు కోరుతున్నారు. డ్రైవర్లకు ఉచిత ప్రమాద బీమా పథకం అమలు చేయాలంటున్నారు. రాష్ట్రంలో సంవ త్సరానికి పది లక్షల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తు న్నాయి. వాహనాలు పెరుగుతున్నంత వేగంగా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేపట్టడం లేదు. రాష్ట్రంలో వాహనాల సంఖ్యకనుగుణంగా రోడ్లను విస్తరిస్తే డ్రైవర్లపై ఒత్తిడి తగ్గుతుంది.

ట్రాఫిక్ సమస్య పెరిగింది..

- ఆర్.రమేష్, డ్రైవర్, గోదావరిఖని



చిన్న వాహనదారులకు డ్రైవింగ్‌పై అవగాహన లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. విధి నిర్వహణలో నాలుగైదు సంవత్సరాలుగా రోడ్లపై డ్రైవింగ్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. టూ వీలర్, ఫోర్ వీలర్స్, సిటీలో ఆటోలతో ఆర్టీసీ బస్సులతోపాటు భారీ వాహనాల డ్రైవర్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

బాధ్యతాయుతంగా డ్రైవింగ్

- హలీమ్, ఆర్టీసీ డ్రైవర్ కరీంనగర్



ఎంతో మంది ప్రాణాలు డ్రైవర్ల చేతుల్లో ఉంటాయి. అందుకని బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేస్తాం. ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉంటాం. ప్రయాణికులకు క్షేమంగా గమ్యస్థానానికి చేరుస్తాం. ఒత్తిడి ఉన్నా ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తున్నాం. ట్రాఫిక్ పెరిగిపోవడంతో రోడ్లపై కొంత మేర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పిజియోథెరఫీ కోర్సుల పరీక్ష ఫీజు షెడ్యూల్

గణేశ్‌నగర్,జనవరి22(ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సులలో మొదటి, మూడవ, సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసాద్ బుధవారం ప్రకటించారు. పరీక్షలు ఫిబ్రవరి 2025లో ఉంటాయని, అపరాధ రుసుము లేకుండా 30 జనవరి 2025లో ఫీజు చెల్లించాలని సూచించారు. 300 రూపా యల అపరాధ రుసుముతో 3 ఫిబ్రవరి 2025 వరకు ఆన్‌లైన్ చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, ఆయా కళాశాలల్లోగానీ సంప్రదించాలని సూచించారు.

కలికోట సూరమ్మ చెరువును సందర్శించిన మంత్రులు



సూరమ్మ చెరువు కట్టను పరిశిలిస్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, కథలాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి, కథలాపూర్ మండల మండలాల సరిహద్దులోని కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులను బుధవారం రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. గతంలో ప్రాజెక్టు నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల సంబంధించిన ఫొటో గ్యాలరీలను, ప్రాజెక్టు డిజైన్‌ను మంత్రులు పరిశీలించడంతో పాటు ప్రాజెక్టు కట్టను పరిశీలిం చారు. కుడి, ఎడమ కాలువల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలు సేకరించి గ్రామ సభలు నిర్వహించామని అడిషనల్ కలె క్టర్ బీఎస్ లత మంత్రులకు చెప్పారు. భూసేకరణ కోసం అద నంగా నిధులు కావాల్సి ఉంటుం దని మంత్రుల దృష్టికి తెచ్చారు. అవసరమైన మేర నిధులు విడు దల చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు మెడి పల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారా యణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తూం జలపతి, సామ మోహన్‌రెడ్డి, గండి నారాయణ, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, పల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



సూరమ్మ రిజర్వాయర్ గురించి మంత్రులకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థిని ఎంపిక

జగిత్యాలరూరల్, జనవరి 22 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని శాన్వి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వినీతత్ తెలిపారు. ఈనెల 11, 13 తేదీల్లో వరంగల్ లో ని కేసముద్రంలో నిర్వహించిన మోడ్రన్ కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపి కైంది. ఈసందర్భంగా విద్యార్థినిని ప్రిన్సి పాల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ నాగేష్, పీడి వినీత్, అజీమ్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కేజ్‌వీల్స్‌తో రహదారులు ధ్వంసం

● పట్టించుకోని అధికారులు

బీర్‌పూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగి త్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని పలు రహదారులపై కేజ్‌వీల్స్ నడవడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. వరి నాట్ల సీజన్ వచ్చిందంటే చాలు ఏ ప్రధాన రహదారి చూసినా కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు ధ్వంసం చేసిన రోడ్లే దర్శనం ఇస్తున్నాయి. జగిత్యాల నుంచి కమ్మునూర్ వెళ్లే ప్రధాన రహదారి, ధర్మపురి నుంచి కమ్మునూర్ వెళ్లే రహదారి దెబ్బ తింది. అయినప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజ లు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కేజ్‌వీల్స్ ప్రధాన రహదారుపై నడిపిన వారిపై చర్య లు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జగిత్యాలకు వెళ్లే ప్రధాన రహదారిపై కేజ్‌విల్‌తో వెళ్తున్న ట్రాక్టర్

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

పెద్దపల్లిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుతం వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. 'వేయి గొంతులు.. లక్ష డప్పులు' కార్యక్రమ సన్నాహక సమావేశం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. 30 ఏళ్ల అలుపెరుగని పోరాటంతో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్నా మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి కుటుంబం వ్యతిరేకిస్తోందన్నారు. ముగ్గురు కుటుంబసభ్యులు చట్టసభల్లో కొనసాగుతూ వ్యాపార సంస్థలు, మీడియా సంస్థలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణను అడ్డుకుంటే వారి పదవులు ఉండవని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే 58 కులాలకు మేలు జరుగుతుందన్నారు. వర్గీకరణను అడ్డుకుంటే మాదిగలే ఎక్కువ నష్టపోతారన్నారు. ఈక్రమంలో జరిగే పరిణామాలకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వేల గొంతులు, లక్ష డప్పుల నిరసన కార్యాక్రమానికి ప్రతీఇంటి నుంచి ఒక్క డప్పు తరలిరావాలని పిలుపునిచ్చారు. డప్పు చప్పుళ్లు రాష్ట్ర ప్రభుత్వానికి వినబడేలా ఉండాలని సూచించారు. అవసరమైతే ఇంటింటికీ చందాలు వేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాసిపేట లింగయ్య, బొడిగె శోభ, ఈర్ల స్వరూప తాండ్ర సదానందం, వాసు, మామిడిపెల్లి బాపయ్య, శ్యాం, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

తిమ్మాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఎన్ఐటి, ఐఐటీల్లో 2025-0-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ తొలివిడత ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఆల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 1,075 మంది అభ్యర్థులకు 1,048 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరు అయ్యారు. రెండవ సెషన్‌లో 1,050 మందికి 1,019 మంది హాజరు కాగా 31 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండవ సెషన్‌లో పరీక్షలు నిర్వహించారు. నిమిషం ఆలస్య నిబంధనలతో పలువురు విద్యార్థులు వెనుదిరిగారు. జనవరి 22, 23, 24, 28, 29 తేదీలలో పేపర్ 1, జనవరి 30న బీఆర్క్‌బి ప్లానింగ్ సీట్ల కొరకు పేపర్ 2 పరీక్ష జరగనున్నట్లు ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి.లలిత కుమారి తెలిపారు.



తిమ్మాపూర్‌లోని పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

ఆన్‌లైన్‌లో వేములవాడ రాజన్న సేవలు



వేములవాడ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి సేవలను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయంలో నిర్వహించే నిత్యపూజలు, వసతిగదులతో పాటుగా బద్దిపోచమ్మ, భీమేశ్వర ఆలయాలకు సంబంధించిన సమగ్ర సమాచారం, పూజల వివరాలను ఆలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దేవాలయాల్లో జరిగే పూజలతో పాటు వసతి గదుల టికెట్లను వెబ్‌సైట్‌లో ఈ-టికెటింగ్ పద్ధతిలో భక్తులు పొందవచ్చని, మీసేవా కేంద్రాల్లోనూ ఈ-టికెట్లు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

ఒక మొక్క.. వంద కంకులు

సుల్తానాబాద్, జనవరి 22: (ఆంధ్రజ్యోతి): మామూలుగా మొక్కజొన్న మొక్కకు రెండు కానీ లేదా మూడు కంకులు కాయడం మామూలు విషయం. ఎక్కువగా రెండు కంకులు మాత్రమే చూస్తుంటాం.. కానీ సుల్తానాబాద్ మండలంలోని కనుకుల మారుతీనగర్ చెందిన నరేష్ అనే రైతు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో ఒకే మొక్కకు ఏకంగా వంద కంకులు పండాయి. నూనె నరేష్ అనే రైతు రెండున్నర ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేశాడు. అంతర పంటగా మొక్కజొన్న వేశారు. మొక్కజొన్న చేనులో ఓ మొక్కకు ఏకంగా వంద కంకులు కాశాయి. దీంతో పలువురు రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామ, వార్డుసభల్లో

నిలదీతలు.. నిరసనలు

● జాబితాలో అర్హుల పేర్లు లేవని ఆందోళన

● ప్రజా పాలన దరఖాస్తులు మాయమయ్యాయని పలువురి ఆరోపణ



మోరపల్లి లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు



ధరూర్ లో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

జగిత్యాలరూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో బుధవారం చేపట్టిన గ్రామసభలు రసాభాసగా మారాయి. జగిత్యాల మండలంలోని ధరూర్, తిప్పన్నపేట, నర్సింగాపూర్, సోమన్‌పల్లి, వంజరిపల్లి, మోరపల్లిలో గ్రామ సభలు నిర్వహించారు. మోరపల్లి గ్రామంలో దరఖాస్తులదారుల నుంచి రూ.500 వసూలు చేశారని ఆరోపిస్తూ గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. గ్రామ సభను బహిష్కరించి తన నిరసనను తెలిపారు. ధరూర్ గ్రామంలో అర్హుల జాబితాను వెల్లడించే క్రమంలో గ్రామస్థులు అడ్డుకొని తమ నిరసనను తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో అనర్హులకు చోటు కల్పించారని ఆందోళనకు దిగారు. గ్రామ సభను బహిష్కరిస్తూ తీర్మానం చేశారు.

●కొడిమ్యాల: ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులు మాయమయ్యాయని కొడిమ్యాల మండల కేంద్రంలో పలువురు యువకులు ఆందోళన చేశారు. మండల కేంద్రానికి చెందిన చెన్న దేవేందర్ అనే వ్యక్తి కింద పడుకొని నిరసన వ్యక్తం చేశాడు. రేషన్‌కార్డుల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హులను ఎందుకు ప్రతిపాదించారని పలువురు ప్రశ్నించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి. రమేష్ మాట్లాడుతూ ప్రతిపాదనల జాబితాలోని పేర్లు చదివామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కొండాపూర్, గౌరాపూర్, హిమ్మతురావుపేట గ్రామాల్లో ఎంపీడీవో స్వరూప, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

●బీర్‌పూర్: మండలంలోని బీర్‌పూర్, నర్సింహులపల్లి, కండ్లపెల్లి, తాళ్ళధర్మారం, రేకులపెల్లి లో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పై పథకాల కోసం ఎంపిక చేసిన జాబితాలను చదివి వివరించగా గ్రామాలలో ప్రజలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. అర్హులైన వారిని ఎంపిక చేయకుండా అనర్హులను ఎంపిక చేశారని అధికారులను నిలదీశారు. దీంతో ప్రజలకు సమాధానం చెప్పలేకా అధికారులు సమావేశాలను ముగించుకొని వెల్లిపోయారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజిబుద్దిన్, ఎంపీడీవో లచ్చాలు, పంచాయతీరాజ్ ఏఈ విశ్వేందర్ రావ్, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●సారంగాపూర్: పోతారం, లచ్చక్కపేట, భీంరెడ్డి గూడెంలలో నిర్వహించిన గ్రామ సభలు రసాభాసగా జరిగాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ళ జాబితాలో లర్హులైన తమ పేర్లు రాలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉపాధి పనికి ఒక్క రోజు కూడా వెళ్లని వారి పేర్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాల్లో రావడంతో అర్హులైన వారు అవాక్కయ్యారు.

●రాయికల్: పట్టణ ప్రజలు వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని 4వ వార్డులో బుధవారం అధికారులు వార్డు సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, మున్సిపల్ కమిషనర్ జగదీ శ్వర్ గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

●రాయికల్: మండలంలోని ఇటిక్యాల, రామారావుపల్లె, సింగరావుపేట, అల్యానాయక్ తండా, కట్కాపూర్, రాజనగర్, ఒడ్డెలింగాపూర్, వీరాపూర్ తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కొత్త రేషన్ కార్డులకోసం 548, రేషన్ కార్డులలో పేర్లు చేర్చుటకు 316, ఇందిరమ్మ ఇళ్ల కోసం 239, ఆత్మీయ భరోసా కోసం 131, రైతు భరోసా కింద 4దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని 7, 8, 9, 10, 11, 12 వార్డులతో పాటు మండలంలోని దమ్మన్నపేట, మగ్గిడి, దొంతాపూర్, రాయపట్నం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రత్యేకాధికారులు చిత్రు, రాంచందర్ మాట్లాడుతూ పేద ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కౌన్సిలర్లు, ఎంపీడీవో రవీందర్ పాల్గొన్నారు.

●గొల్లపల్లి: మండలంలోని ఆత్మకూర్, బొంకూర్, దమ్మన్న పేట, ఇస్రాజ్ పల్లె, రంగదాముని పల్లె, తిర్మలాపూర్ (పీడీ) గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో రాంరెడ్డి, మండల ప్రత్యేకాధికారి డా. కిషోర్‌ఏవో కరుణ, ఎంపీవో సురేష్ రెడ్డి, ఉన్నారు.

●పెగడపల్లి: మండలంలోని లింగాపూర్, నందగిరి, నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, దీకొండ, మద్దులపల్లి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. సమావేశాలలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో మహేందర్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: మండలంలోని పెద్దాపూర్, విట్టంపేట, మేడిపల్లి, బండలింగాపూర్, ఏఎస్ఆర్ తండా, ఆత్మకూర్, ఆత్మనగర్, రాజేశ్వర్‌రావుపేట, మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో సభలు అధికారులు నిర్వహించారు. పథకాలకు అర్హులుగా గుర్తించబడిన విట్టంపేట, పెద్దాపూర్‌లోని వివరాలను ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి గ్రామసభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కూన గోవర్ధన్, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ రాజుమహమద్ పాల్గొన్నారు.

●వెల్గటూర్: గుల్లకోట, పాతగూడూర్, సూరారం, కప్పారావుపేట, తాళ్లకొత్తపేట, కోటిలింగాల, పాషిగామ, జగదేవ్‌పేట గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారులు తహశీల్దార్‌లు శేఖర్, రవికాంత్, ఎంపీడీవో రవీంధర్, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

●కోరుట్ల: మండలంలోని మాదాపూర్, గుమ్లాపూర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డీఓ రఘువరన్, ఎంపీడీఓ రామకృష్ణ, ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామని, జాబితాలలో రాని వారు ఎవరు అధైర్యపడవద్దని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణంలోని 1, 4, 7, 10, 13, 17, 19, 22వ వార్డులలో వార్డు సభలు నిర్వహించారు. పలు వార్డులలో జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కమిషనర్ టి. మోహన్, ప్రత్యేక అధికారి డిఐఈఓ బి. నారయణ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు లింగం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: మండలంలోని మూలరాంపూర్, కేశపూర్, వర్షకొండ, యామపూర్ గ్రామాలలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని నడికుడ గ్రామంలో జరిగిన గ్రామసభలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. వికలాంగులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఎన్‌జీవో జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పం చిన్నారెడ్డి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని రాఘవుపేట, వెంకట్రావుపేట, రేగుంట, సిర్పూర్, వాల్గొండ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

●కథలాపూర్: పోసానిపేట, భూషణరావుపేట, ఊట్‌పల్లి, పోతారం గ్రామాల్లో ఆత్మీయ భరోసాకు అర్హులమైన ప్పటికీ జాబితాల్లో పేర్లు లేవని మహిళలు అసంతృప్తి వెలిబుచ్చారు. పేర్లులేని వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని కోరడంతో దరఖాస్తులు సమర్పించుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ శంకర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఏఓ యోగిత ఉన్నారు.

●మల్యాల: అనర్హులను ఆత్మీయ భరోసా జాబితాలో చేర్చుతున్నారంటూ మండలంలోని సర్వాపూర్ గ్రామసభలో ఉపాధిహామీ కూలీలు ఆందోళన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ అర్హులందరకీ సంక్షేమపథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని జాబితాల్లో పేర్లులేని వారు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మండలంలో సర్వాపూర్, బల్వంతాపూర్, నూకపల్లి, మద్దుట్ల, రామన్నపేటలో గ్రామసభలు జరుగగా ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీంధర్ పాల్గొన్నారు.

వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలి

-అదనపు కలెక్టర్ లత

కోరుట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ వార్డులలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీమ భరోసా, రైతు భరోసా లబ్దిదారుల ఎంపిక కొరకు నిర్వహించిన వార్డు సభలను అదనపు కలెక్టర్ లత పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ జీవకర్ రెడ్డి, తహసిల్దార్ కిషన్, కమీషనర్ తిరుపతి, వివిధ వార్డులలో కౌన్సిలర్ల్, అధికారులు పాల్గొన్నారు.

బదిలీల్లో దళారులు

3వ పేజీ తరువాయి..

ఇతర జిల్లాల్లో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న టీచర్లు ఇక్కడి జిల్లా పాత సర్వీస్, సీనియారిటీని కోల్పోతారు. వారు వెళ్లే జిల్లాలో కొత్తగా సర్వీస్, అక్కడి టీచర్ల కేడర్‌లో చివరి జూనియర్‌గా సర్వీస్‌గా పరిగణిస్తారు. వేరే జిల్లాల నుంచి జగిత్యాలకు వచ్చిన వారి పరిస్థితి అలానే ఉంటుంది. ఈ విధంగా పాత సర్వీసును కోల్పోయేందుకు, కొత్త జిల్లాలో కొత్త సర్వీసుకు ఒకే చెబుతూ అంగీకారంగా అండర్ టేకింగ్‌ను డీఈవో కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా టీచర్ల సర్వీస్ బుక్స్‌ను కూడా పరిశీలిస్తారు. దానిని ఉన్నతాధికారులు పరిశీలించాక పరస్పర బదిలీలు చేపట్టనున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా పనిచేసేలా చూడాలి



గత ప్రభుత్వం విడుదల చేసిన 317 జీవోతో ఉపాధ్యాయులు చెల్లాచెదురు అయ్యారు. స్థానికంగా ఉంటే ఒత్తిడి లేకుండా పని చేస్తారు. మంచి ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం సంబంధిత జీవో ద్వారా ఇబ్బంది పడిన వారందరికీ న్యాయం చేయాలి.

-అంబటి భూమేశ్వర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు బదిలీలు



ప్రభుత్వ విడుదల చేసిన ఉత్తర్వులు మేరకు పరస్పర బదిలీలు చేస్తాం. అయితే ఇరు ప్రాంతాల ఉపాధ్యాయుల అంగీకార పత్రాలు పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ఉంటుంది. ఇబ్బందులు ఎదురు కాకుండా ఉన్నతాధికారుల సూచనలు తీసుకుంటాం.

- రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

రేషన్ కార్డులు మంజూరు చేయాలి

మెట్‌పల్లి టౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డులను మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఉస్మాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోస, ఇందిరమ్మ ఇళ్లతో పాటు తదితర పథకాలకు అర్హులను ఎంపిక చేయాలంటే రేషన్‌కార్డే ఆధారం అన్నారు. ప్రభుత్వం మొదటగా పేద ప్రజలందరికి రేషన్ కార్డులు మంజూర్ చేయాలని కోరారు.

ఘనంగా భరతమాత పూజ

కొడిమ్యాల, జనవరి22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో భరతమాత మాసోత్సవ కార్యక్రమంలో బాగంగా బుధవారం తెలంగాణ ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో భరత మాత చిత్రపటానికి సభ్యులు పూజలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ దర్మ జాగరణ సమితి మండల అధ్యక్షుడు సత్తయ్య, మాజీ సర్పంచులు మల్లేశం, శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కొడిమ్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యం బుధవారం అదె గ్రామానికి చెందిన తల్లితండ్రిని కోల్పోయిన మణిదీప్, దివ్య అనె ఇద్దరు చిన్నారులకు రూ.30వేలు నగదును అందించి ఉదార స్వభావాన్ని చాటుకున్నాడు. తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన కొత్తపెల్లి పూజకిషన్ మరణించడంతో ఇద్దరు చిన్నారులు నానమ్మ, తాత వద్దనె ఉంటు చదువుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేని వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకొని ప్రధానోపాధ్యాయుడు గ్రామ నాయకుడు మ్యాకల మల్లేశంయాదవ్ సమక్షంలో 30 వేల రూపాయల నగదును అందించారు. గ్రామ ప్రముఖులు నరేష్, కిషన్, గణేష్, తదితరులు ఉన్నారు.

రా రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మైలారపు రాంబాబును సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి

జగిత్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని రాష్ట్ర రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గణపతి రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఇటీవల రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షునిగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికయిన మైలారపు రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మిల్లర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. మిల్లర్లు సంఘటితంగా ఉండడం వల్ల సమస్యల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రా రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, నాయకులు పోచమల్ల ప్రవీణ్, గోలి రమేశ్, నరేందర్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'సంవిధాన్ గౌరవ్ అభియాన్'

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లింగపేట్‌లో గల ఎస్సీ కాలనీలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు కొక్కు గంగాధర్ మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాగిల్ల సత్యనారాయణ, లింగంపేట రాజన్న, దురిశెట్టి మమత, కాశెట్టి తిరుపతి, పవన్‌సింగ్, మాడిశెట్టి మల్లేశం, లక్ష్మారెడ్డి, శేఖర్, నారాయణతో పాటు గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఇంగ్లీషు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీషు ఒలంపియాడ్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రభుత్వ బాలికల హై స్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని కావ్యశ్రీ ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయ బృందం జ్ఞాపిక, ధృవపత్రం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామానుజం, తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య పాల్గొన్నారు.

మినీ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు చేయూత

రాయికల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పూర్వ విద్యార్థి పునుగోటి భరత్ రావు తన తండ్రి భాస్కర్ రావు జ్ఞాపకార్థం రూ.32 వేల ఆర్థిక సహాయం అందించాడు. ఈ సందర్భంగా భరత్ రావును ప్రధానోపాధ్యాయుడు తిరుక్కోవెల వేణుగోపాల్ అభినందించారు.

ఆలయ అభివృద్ధికి ప్రవాస భారతీయుల చేయూత

రాయికల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయం అభివృద్ధికి రాయికల్ పట్టణ, ఇతర గ్రామాలకు చెందిన ప్రవాస భారతీయులు చేయూతనందించారు. దుబాయ్ నుంచి గోనె మహేష్ దేవా, గోనె వెంకటేష్‌లు శివాలయంలో నిర్మించబోయే కల్యాణ వేదిక, సహస్ర దీప మండపం కోసం రూ.44 వేలను పంపించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కోరుట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన మహేష్ ఇండస్ట్రీ రైస్ మిల్ యజమాని బచ్చు మహేష్ కుటుంబానికి రాష్ట్ర అసోసియేషన్ అండగా ఉంటుందని రా రైస్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జాన్సీరోడ్డులోని బచ్చు మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రా రైస్ మిల్లుల యజమానులు, సంఘ సభ్యులు పోచమ్మల ప్రవీణ్, శ్రీనివాస్, మైలారపు రాంబాబు, కొత్త వాసు, లింగ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

సల్లంగా చూడు..గొల్ల కేతమ్మ తల్లి



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పంటలు సమృద్ధిగా పండి, పిల్లాజెల్లాను సల్లంగా చూడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గొల్ల కేతమ్మ తల్లిని వేడుకున్నారు. బుధవారం గొల్లపల్లి మండలం నందిపల్లె గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గొల్ల కేతమ్మ తల్లికి పట్నాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ గ్రామ దేవత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు, పెద్దలు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ కుమార్‌కు పూర్ణకుంభాభిషేకంతో ఘన స్వాగతం పలికి ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గర్భగుడిలోని కులదైవంను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ పూజారులు ఆశీర్వచనాలు అందించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్‌ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

బోర్‌వెల్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్

గొల్ల కేతమ్మ తల్లి ఆలయం వద్ద నూతనంగా మంజూరైన బోర్‌వెల్‌ను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నీటి వసతి కల్పించాలని కోరగానే వెంటనే బోర్‌వెల్‌ను మంజూరు చేయించిన లక్ష్మణ్ కుమార్‌కు యాదవ సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, యూత్ అధ్యక్షులు గౌతమ్ రాజు, తాజామాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, భేర కిషోర్, నాయకులు ఈర్నాల రాజేశ్వర్, రంగు శ్రీనివాస్ గౌడ్, కాసారపు అరవింద్ గౌడ్, మహేష్, వెంకటేష్ గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్యాక్స్ కేంద్రాన్ని పునరుద్ధరించాలి

గొల్లపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామంలో గతంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు బుధవారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 1980 సంవత్సరంలో గ్రామం చుట్టూ ఉన్న గ్రామాలను కలిపి ప్యాక్స్ కేంద్రంను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 2006వ సంవత్సరంలో ఇట్టి సంఘంను గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో విలీనం చేశారని పేర్కొన్నారు. దీంతో ఆయా గ్రామాల రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, ఆయా గ్రామాల రైతుల సౌకర్యార్థం తిరిగి వెంగళాపూర్ ప్యాక్స్ సంఘంను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విప్ లక్ష్మణ్ కుమార్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. దీనికి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సానుకూలంగా స్పందించిన లక్ష్మణ్ కుమార్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు బలభక్తుల కిషన్, ఎడ్మల మల్లారెడ్డి, నాయకులు కొండ్ర గంగారెడ్డి, రాజేంధర్, అనిల్ రెడ్డి, వనపర్తి రాజేంధర్, కొండ్ర మల్లారెడ్డి, ఇనుగంటి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి



చెక్కులను అందజేస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు రాజుపాల్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 22 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరికీ అండగా పార్టీ ఉంటుందని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి అన్నారు. పార్టీ బూత్ స్థాయి అధ్యక్షులు మారు జనార్ధన్‌రెడ్డి, గుండెని భూమ య్యలకు అరవింద్ ధర్మపురి కార్పస్ పండు ద్వారా మంజూరైన రూ.20 విలువ గల చెక్కులను బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరవింద్ ధర్మపురి కార్పస్ ఫండ్ ద్వారా బూతు స్థాయి కార్యకర్తలు చనిపోయిన, ప్రమాదాలకు గురైనా, శుభకార్యాలకు నిధులు అందజేస్తున్న అభినందనీయమన్నరు. ప్రతి కార్యకర్తకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

మల్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణం కోసం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ, బండి సంజయ్ రూ.1.02కోట్లు మంజూరి చేసినట్లు మండల బీజేపీ అధ్యక్షుడు గాజుల మల్లేశం తెలిపాడు. ఈ నిధులతో గ్రామాల్లో 35 పనులు చేపట్టడం జరుగుతందని అన్నారు. నిధులు మంజూరు చేసినందుకు బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ పురస్కారం అందుకున్న రవళి

వెల్గటూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మొక్కట్రావుపేట గ్రామానికి చెందిన బావండ్లపెల్లి రవళి అనే యువతి బుధవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో శ్రీ శ్రీ కళావేదిక ద్వారా యువ తేజం జాతీయ పురస్కారం అందుకున్నారు. శ్రీ శ్రీ కళావేదిక మరియు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో యువ తేజం జాతీయ యువ ప్రతిభా పురస్కారానికి రవళి అందుకున్నారు.

మల్లన్న పట్నాలు

కొడిమ్యాల, జనవరి22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారావుపేట గ్రామ మాజీ సర్పంచు గరిగంటి మల్లేశం ముదిరాజు ఇంటిలో నిర్వహించిన మల్లన్న పట్నాలకు బుధవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ హాజరయ్యారు. మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు.

సోలార్‌ప్లాంట్‌కు స్థల పరిశీలన

జగిత్యాలరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తి కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేస్తున్న సోలార్‌ప్లాంట్ ఏర్పాటు కోసం నర్సింగాపూర్, తిమ్మాపూర్, చల్‌గల్, పొలాస, తాటిపల్లి, గ్రామాల శివారులల్లో గల ప్రభుత్వ భూములను బుధవారం రెడికో ఏడిఓ లక్ష్మీకాంతరావు పరిశీలించారు. ఆయన వెంట సెర్ప్ ఏపీడి చరణ్‌దాసు, విద్యుత్ ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్యాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పురగిరి క్షత్రియ పెరక సంఘం క్యాలండర్‌ను మల్యాలలో బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు బుచ్చన్న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, పోతరాజు గంగన్న, మండల శాఖ అధ్యక్షుడు ఆనందం, మీస రమేశ్ పాల్గొన్నారు.

బాధితుడికి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

జగిత్యాలరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్‌గ్రామ మాజీ సర్పంచ్ కొక్కు సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత సుధాకర్ ను పరామర్శించారు. తన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు కన్నపూర్ గ్రామంలో పలుకుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

బీర్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ మృతి

బీర్‌పూర్,జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామానికి ఉప సర్పంచ్‌గా సేవలందించిన బైరవేణి అంజనేయులు(85) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అంజనేయులు బీర్‌పూర్ గ్రామంలో మూడు సార్లు ఉప సర్పంచ్‌గా, రెండు సార్లు బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అంతే కాకుండా బీర్‌పూర్ గ్రామంలో లక్ష్మీనరసింహా స్వామి కమాన్‌లు నిర్మించడంలో ఎంతో కీలకమైన పాత్ర పోషించిన ఆయన దూర ప్రాంతాలకు వెల్లి చందాలు సేకరించి పనులు పూర్తి చేయడంలో తనవంతు బాధ్యతలను ఎనిమిది పదుల వయస్సులో కూడా నిర్వర్థించడం హర్షించదగ్గ విషయమని గ్రామస్తులు ఆయన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

ఐఎంఏ అధ్యక్షుడికి ఘన సన్మానం

మెట్‌పల్లి టౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి) :ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండవ సారి నియామకమైన డాక్టర్ గంగాసాగర్‌ను బుధవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గంగాసాగర్‌ను అభినందించి పూలమాల, శాలువతో సత్కారించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మెన శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు, నాయకులు నారయణ, సదానందం, ప్రతాప్, జావీద్, నర్సింగరావు తదితరులుఉ పాల్గొన్నారు.

వితంతు పింఛన్లు మంజూరు చేయండి

జగిత్యాల అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వితంతు పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని జగిత్యాల 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ సిద్దించాక ఒకేసారి వితంతు పింఛన్లు మంజూరు చేశారని, మళ్లీ 2022లో కొంత మందికి ఇచ్చారని, అలా కాకుండా వితంతు పింఛన్ల మంజూరీ అనేది నిరంతరం కొనసాగేలా చూడటం వల్ల అనేక మంది భర్త లేని మహిళలకు ఆసరా అవుతుందని లేఖలో పేర్కొన్నారు.